# దివ్యత్వాన్నిమరచినదే జీవత్వము

తగదు తగదు ధనదాహము నరుడా
మంచి బుద్ధితో మానుము కోర్కెలు
కర్మ ఫలితమే కదరా విత్తము
కలుగునంతలో కనరా తృప్తిని
హరిగోవిందా హరిగోవిందా
హరిగోవిందా అనరామందా
మృత్యువు దాపున మసలేటప్పుడు
ధనము చదువు కాపాడదురా.
హరిగోవిందా హరిగోవిందా
హరిగోవిందా అనరా మందా
ముక్తికోరి నరుడు ముక్కోటి దేవతల
వేడుచుండునుగాని వెతలు బోవు
తనయందున్న అహమును తా చంపిన
ముక్తియేల తానె ముక్తికాడె

**విద్యార్థులారా!**

మానవుడు సుఖమును అభిలషించుచున్నాడు. ఇతను ఆనంద పిపాసి. రాత్రింబవలు వీటిని పొందే నిమిత్తమై అనేక విధములైన శ్రమలు పడుతున్నాడు. మానవునికి కావలసినవి రెండే, రెండు. ఒకటి సుఖప్రాప్తి, రెండవది దుఃఖనివృత్తి. ఐతే మానవుడు యీవిధంగా సుఖమును కోరటము, దుఃఖమును విసర్జించటములో ఉండిన అంతరార్థము యేమిటి? దీనికి వైజ్ఞానిక సత్యముకూడను ఒకటి కలదు. చక్కెరకు మధురత్వము, విచ్చిన గులాబి పుష్పమునకు సుగంధము సహజములు. అగ్నికి దహనశక్తి, మంచుగడ్డకు చల్లదనము సహజస్వరూపాలు. వీటిని ప్రత్యేకించి

sri sathyasai vachanamrutam

ఏవో కొన్ని సాధనలచేత సంపాయించుకొన్నవి కాదు. అదే విధముగనే మానవునకు సుఖము, ఆనందము తన సహజ స్వరూపాలు. తన సహజ గుణము తాను అభిలషించటము యిది కూడను సహజమే! తన స్వరూపాన్ని తాను అభిలషించటము ఇది కూడను సహజమే!

**సహజమైన ఆనందమును విస్మరించినప్పుడే అసహజమైన దుఃఖము ప్రాప్తిస్తుంది**

ఈ సహజత్వమును మనము యీనాడు విస్మరించి, అసహజాన్ని విశ్వసించి అశాంతికి గురౌతున్నాము. దివ్యత్వాన్ని మరచినదే జీవత్వము. దివ్యత్వమే తన స్వరూపముగా నిలిచినది దైవత్వము. కనుక, తనయొక్క స్వరూపాన్ని మరచటం చేతనే మానవుడు అశాంతికి గురౌతున్నాడు. ప్రపంచమునందు యీ సహజములు సర్వత్రా నిత్యము మనము చూస్తూనే ఉంటున్నాము. ఒక వ్యక్తి దారిలో యేడుస్తూ ఉంటాడు. అటువైపు వెళ్లే ప్రతివ్యక్తికూడను అతని యేడుపు చూచి కారణమేమని ప్రశ్నిస్తారు. కారణమేమిటి? ఏడుపు మానవునియొక్క సహజము కాదు. సహజము కానటువంటి దీంట్లో తాను దుఃఖించుచుండగా ఆ దుఃఖమునకు కారణమేమిటని సహజమైన మానవుడు ప్రశ్నిస్తున్నాడు. సహజమునకు ప్రశ్నలే ఉండవు. అసహజమునకే ప్రశ్నలు. అసహజమునకే విచారములు. అదే మార్గములో ఒక వ్యక్తి ఆనందముతో చిరునవ్వులు చిందుతూ ఉంటాడు. అతని దగ్గరకు ఎవరూ వెళ్లి 'యెందుకయ్యా? నీవు యేడ్చుటం లేదే?' అని ప్రశ్నించరు. కారణం, అతనికి ఆనందము సహజము కనుక. సహజమైన ఆనందమును విస్మరించినప్పుడే అసహజమైన దుఃఖము ప్రాప్తిస్తుంది. అసహజమైన దుఃఖము ప్రాప్తించినప్పుడే ప్రశ్నల వర్షము కురుస్తుంది.

**ఈనాటి మానవుడు ఆనందమును అన్వేషిస్తూ దుఃఖమును అందించే క్రియలలో పాల్గొంటున్నాడు**

ఐతే ఆ సహజమును మరచటానికి కారణము యేమిటి? శరీర, యింద్రియ, మనో, బుద్ధుల మాలిన్యమే దీనికి అవాంతరములు కలిపిస్తూ ఉంటుంది. అయితే, యీ విధమైన మనోబుద్ధులయొక్క మాలిన్యము అడ్డుపడటానికి కారణం యేమిటి? రాగద్వేషములతో కూడిన భోగవిలాసములు. ఈనాటి మానవుడు కేవలము ఆనందము, ఆనందము అని భ్రమిస్తూ దుఃఖమును అందించే మార్గములో ప్రయాణము సలుపుతున్నాడు. అనేకమంది శ్రీమంతులు, విద్యావంతులు, అధికారులు యీ భ్రమలయందే తమ కర్తవ్యాన్ని గుర్తించుకోలేక మూర్ఖత్వాన్ని

sri sathyasai vahini vachanamrutam

అనుభవిస్తున్నారు. ఒక చిన్న ఉదాహరణము. ఆనంద నిమిత్తమై సుఖాపేక్ష నిమిత్తమై అనేకమంది కొన్ని మత్తు పదార్ధములు భుజించటము, త్రాగటము, జూదములు ఆడటము యింకా అనేక విధములైన వ్యసనములలో పాల్గొంటున్నారు. త్రాగటము ఆనందమని అనుకుంటున్నారు. జూదము ఆడటము సుఖమని అనుకుంటున్నారు. ఆ పెడ మార్గములన్నీ సుఖానంద నిమిత్తమై తాను ఆచరించే క్రియలు అని భావిస్తున్నాడు. అభిలషించటము సుఖము, ఆచరించటము దుఃఖము. ఇవన్నియు దుఃఖమునకు హేతువన్న సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు. దురభ్యాసములచేతను, దుస్సంగముచేతను, దుర్బుద్ధులచేతను అధఃపతనమై పోతున్నాడు, మానవుడు. సమాజములోపల తీరని చెడ్డ పేరును సంపాయించుకుంటున్నాడు. తాను భ్రమించిన ఆనందము యీ క్రియలలో లేదనే సత్యాన్ని తాను తెలుసుకోలేకపోతున్నాడు. సుఖమునకు కారణమేమిటో అనే విషయాన్నికూడను తాను విచారించలేకపోతున్నాడు. ఈ లౌకికమైన, భౌతికమైన, క్షణికమైన, నిరర్థకమైన మార్గమునే నిత్యసత్యమైన ఆనందాన్ని అందిస్తుందని భ్రమిస్తున్నాడు.

**సమస్త దుఃఖములకు మూలకారణము రాగద్వేషములే!**

తన తత్వాన్ని, తన సత్యాన్ని తాను గుర్తించినప్పుడు యెట్టి దుఃఖమునకు అవకాశము ఉండదు, మానవునికి. ఈ అన్నిటికి మూలకారణము రాగద్వేషములే! రాగము కలగటానికి కారణమేమిటి? రాగముకూడను ఒక రోగమే అనే సత్యాన్ని తాను విచారించుకోలేకపోతున్నాడు. తృష్ణ, తృష్ణ, తృష్ణ! యేమిటీ దాహము? ఈ దాహము అనే దానికికూడా కొన్ని హద్దులు ఉంటున్నాయి. అయితే, దాహమునకు అంత్యమనేది ఉండదు. దాహమైనప్పుడు నీరు త్రాగుతాము, కొంతకాలమువరకే ఉంటుంది. తిరిగి దాహమైనప్పుడు నీరుత్రాగాలి. జీవితము ఉండినంతవరకు దాహము తప్పదు. దాహము ఉండినంతవరకు నీరు త్రాగక తప్పదు. ఈ కోరికలు దాహము వంటివి. అందువలనే 'తగదు, తగదు, ధనదాహము జీవా!' ఈ దాహము అన్నింటియందు యేర్పడుతున్నది.

**బాల్యంబునందున పలువురితోకూడి**
**ఆటపాటలందు ఐక్యుడగును**

srisathyasaivachanamrutam

యౌవనంబలరిన అలరు విల్తుని పోల్కి
కామినీలోలుడై క్రాలుచుండు
అర్ధవయస్సున ఐహికంబున మునిగి
ద్రవ్యమార్జించుట దవిలియుండు
ముదిమివచ్చినయంత మురహరితలవక
అది యిది లేదని అలమటించు
వివిధ దుర్వ్యసనంబులు వీడలేక
భక్తిమార్గంబు వెతుక ఆసక్తిలేక
కర్మపంకిలమున బడి క్రాలుచుండు
మట్టిగలుపును జన్మంబు మానవుండు

బాల్యమునందు ఆటపాటలు, చదువు సంధ్యలు, యిత్యాది క్రియలచేత ఆనందముగా కాలము గడపుతూ ఉంటాడు. ఇంతలోపలనే యవ్వనము ప్రవేశిస్తుంది. ఆ యవ్వనమందు కండబలము, గుండెబలము ఆధారము చేసుకొని కన్ను మిన్ను తెలియక, పెద్దచిన్న అని విచారించక, మంచి చెడ్డ అనే తారతమ్యము తెలుసుకోకుండా వెఱ్ఱివానివలె విఱ్ఱవీగి అనేక విధములుగా జీవితమును వ్యర్థము గావించుకుంటాడు. ఈ విధమైన భావములచేతను, ఆలోచనలచేతను జీవితముతో ఒక బంధము యేర్పడిపోతుంది. తదుపరి, ఒకరిద్దరు బిడ్డలు పుట్టిన తక్షణమే యేదోవారిని వుద్ధరించే నిమిత్తమై ధనార్జన, గృహములు నిర్మాణము చెయ్యాలి, భూములు కొనాలి, కార్లు కొనాలి, మోటారుసైకిలు కొనాలి, యీ విధమైన వాంఛలతో మరింత బాధపడుతున్నాడు. ఈలోపల ముసలితనము ముంచుకొస్తుంది. అప్పుడు తన మాటలు పుత్రులు వినరు, భార్యకూడా వినదు. ఒకమూల కూర్చోమని చెబుతారు. అప్పటికి గడచిన కాలమును, గడచిన విషయములను విచారిస్తూ, వగస్తూ ఉంటుంటాడు.

అందము ప్రాయము యింద్రియశక్తియు
ఉందని నిక్కకురోరన్నా
ముందున్నదిరా తొందరలోనే

**ముసలితనమ్మను ముసళ్ళపండువు**

మన జీవితమనేది మనము విచారించుకున్నప్పుడు యెన్నో విధములైన తాపత్రయములకు మనము గురికావలసి వస్తుంది. నీస్థాయిలు క్షణక్షణములకు కదలిపోతున్నాయి. బాల్యము, కౌమారము, యవ్వనము, వార్ధక్యము నాల్గు స్థాయిలు కూడను క్షణాలలోపల కదలిపోతున్నాయి. కానీ, స్థాయిలు వేరువేరుగా ఉండినప్పటికిని వ్యక్తి ఒక్కడుగానే ఉంటున్నాడు. ఈ నాలుగుస్థాయిలు అనుభవించేది ఒకే వ్యక్తి.

ఇవన్నీ కూడను తృష్ణతో కూడినవే! చదువు కావాలి, అది ఒక తృష్ణనే! ఉద్యోగము కావాలి, అదీ ఒక తృష్ణనే! పెండ్లి కావాలి, అదీ ఒక తృష్ణనే! పిల్లలు కావాలి, అదికూడను తృష్ణనే! తల్లి, తండ్రి, ఉద్యోగము, కీర్తి మర్యాదలు యివన్నీ తృష్ణలో చేరినటువంటివి. ఈ తృష్ణ అనేది బలమైన సంకెళ్లవంటిది. కాల, కర్మ, కారణ, కర్తవ్యములు కలసి వచ్చినప్పుడు కాలమార్పుచేత యినుప సంకెళ్లుకూడను తుప్పుపట్టి బలహీనము కావచ్చు. అయితే కాలము గడచుకొలది తృష్ణ మరింత గట్టిపడుతుందే గాని బలహీనత యేనాటికి రాదు. కనుక, మొట్టమొదట ఆశలను అరికట్టుకోటానికి ప్రయత్నించాలి.

**విజ్ఞాన శాస్త్రమందు విస్తృత స్థాయిలో పరిశోధనలు జరుపవచ్చునే గాని, ఉన్నదానిని మార్పు చేయటానికి వీలుకాదు**

నిత్య జీవితములో సత్యమైన మార్గమును అవలంబించటానికి కొన్ని నిబంధనలు ఉంటున్నవి. అన్నింటియందు ఒకే సత్యము యేకీభావమై అంతర్భూతమై అంతర్వాహినిగా ప్రవహిస్తున్నాది. చదువులోని సత్యాన్నికూడను మీరు గుర్తించటానికి ప్రయత్నించాలి. 2+2=4 అవుతుంది. అయితే, పదివేల సంవత్సరములకు పూర్వము, రాబోయే పదివేల సంవత్సరముల తరువాత, యిప్పుడున్న పరిస్థితులయందు యేదేశమైనా, ఏకాలమైనా సరే యీ సత్యము మారేదికాదు. ఎంతకాలము గడచినా, ఏదేశము పోయినా, ఏ పరిస్థితి యందైనా, ఏ గవర్నమెంటునందైనా 2+2=4. యిది గణితశాస్త్రముయొక్క సత్యము. ఇంక పదార్థ విజ్ఞానశాస్త్రముయొక్క సత్యము యేవిధముగా ఉంటుందంటే ఒక సూదిని మనము తీసుకొని ఒక క్యాండిల్‌దగ్గర పెట్టినప్పుడు సూది పెద్దదిగా పెరుగుతుంది. ఇది పదార్థ విజ్ఞాన

శాస్త్రముయొక్క సత్యము. రసాయన శాస్త్రముయొక్క సత్యము యేరీతిగా ఉంటుందంటే సున్నము, పసుపు యీ రెండు కలిసినప్పుడు ఎఱుపురంగుగా బయలు దేరుతుంది. ఏకాలమునకైనా యిది సత్యము. ఇది మార్పుచెందునది కాదు. ఇంక వృక్షశాస్త్రము యొక్క సత్యము. ఒక గ్లాసు తీసుకొని దానిలోపల వేర్లుపైకి, మొక్కను క్రిందకి పెట్టినప్పుడు కూడా అది చక్కగా పెరుగుతుంది. ఈ గణితశాస్త్రము, రసాయనశాస్త్రము, పదార్థ విజ్ఞానశాస్త్రము, వృక్షశాస్త్రములయొక్క సత్యము యేనాటికి మారేది కాదు. విస్తృత పరిధిలో పరిశోధనలు సలుపవచ్చునేగాని ఉన్నదానిని మార్పుచేయటానికి వీలుకాదు.

**దుఃఖనివృత్తి, ఆనంద ప్రాప్తియే మానవుని గమ్యం**

అదే విధముగనే మానవునియొక్క తత్త్వమునందుకూడను మార్పు చెందనటువంటిది ఒకటి ఉన్నది. ఎలాంటి పరిస్థితియందైనా, ఏదేశమేగినా, ఏ పనులు చేసినా, ఏ పరిస్థితియందుండినా, తనకు ఆనందము కావాలి. అదే పెద్దకోరిక. కారణమేమనగా ఆనందము తనయొక్క స్వరూపమే, స్వభావమే కనుక! తన స్వరూపమును, స్వభావమును ఆశించని మానవుడు లోకములో లేడు. కనుకనే దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి ఆశిస్తున్నాడు, మానవుడు. దీనిని గుర్తించుకొనలేక ఆధునిక విద్యలన్నియు ఆధ్యాత్మిక విద్యను హాస్యాస్పదముగ చూస్తున్నాయి. ఆస్తికుడైన మానవుడు మోక్షాన్ని ఆకాంక్షిస్తుంటే కొంతమంది విద్యార్థులు యేమిటి యీ మోక్షము, ఎందుకు ఆశించాలి, యీ మోక్షములో ఏమిటుంది అంటూ వికారమైన మాటలతో హాస్యాస్పదము గావిస్తున్నారు. మానవుడు మొట్టమొదట గుర్తించవలసినది మోక్షమంటే ఏమిటని? తానంటె ఎవరు? ఆనందస్వరూపమే! కనుక ఆనందమును కోరటం, దుఃఖమును ద్వేషించటము యిదే ముక్తి. ఇది వద్దనే మానవుడు ఎవరైనా ఉన్నారా లోకములో? కనుకనే దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తియే మానవుని గమ్యము. ఇట్టి గమ్యమును లక్ష్యమునందుంచుకొని మానవత్వము ధన్యము గావించుకునే నిమిత్తమై మనము కొంతవరకు పవిత్రమైన మార్గము అవలంబించాలి.

**ఆశలు పెరుగుకొలది మనలో అశాంతి ప్రబలమవుతుంది**

ఇక, మనసును అరికట్టటం. మనస్సంటే యేమిటి? మన సంకల్పములే! ఈ సంకల్పములు కొంతవరకు పరిమితముగా ఉంటుండాలి. ఈ పరిమితములో సంకల్పములను అనుభవించటము సహజమైన జీవితమే! తినటానికి తిండి, కట్టటానికి బట్ట, ఉండటానికి యిల్లు మనకు అత్యవసరమే! ఆరోగ్యము, సుఖము, ఆనందము ఆశించటము మన సహజము. దీని నిమిత్తమై మనము కొన్ని ప్రయత్నములు చేయటముకూడా సహజమే! కాని, యీ కోరికలు మితిమీరి కోరరాదు. ఆశ అనగా, తాను ఉన్నటువంటి స్థానమునుండి మరికొంత ఉన్నత స్థానమునకు పోవాలని ఆశించటమే! ఈ ఆశలు రెండు రకములైనవిగా ఉంటున్నాయి. ఒకటి పేరాశ, రెండవది దురాశ. ఈ దురాశ అనే దానిని కొంతవరకు అర్థము చేసుకోటానికి ప్రయత్నించాలి. మనకొక యిల్లు ఉంది, చాలు. యింకా రెండు కావాలని ఆశించటము, దురాశ. ఆశలు పెరుగుకొలది ఒక విధమైన అశాంతి మనలో ప్రబలమవుతుంది. అశాంతి ఉన్నవానికి సుఖము అత్యంత దూరములో ఉంటుంది. ఆశలచేత మనము అశాంతిని కొనుక్కుంటున్నాము. అశాంతిచేత అసుఖమును అనుభవిస్తున్నాము. ఈ అశాంతికి, అసుఖమునకు మూలకారణం యేమిటి? మనకోరికలే! వస్తువులపై వాంఛలు పెరిగేకొలది మనకు అశాంతికూడను అధికమవుతుంది. ఈ వాంఛలు తరిగేకొలది ఆనందము పెరుగుతూ వస్తుంది. కనుక, మనము ఆనందము అభిలషించినప్పుడు ఆనందమునకు సంబంధించిన క్రియలలోనే ప్రవేశించాలి. తాత్కాలికంగా ఆనందమును అనుభవిస్తున్నామని అంతకంటె అధికంగా దుఃఖమునుకూడా అందుకుంటున్నాము. తుచ్ఛమైన, క్షణభంగురమైన సుఖము నిమిత్తమై అనంతమైన దుఃఖములో మనము ప్రవేశిస్తున్నాము. ఈనాటి మన దురభ్యాసములు, దుర్భావములు, దుస్సంగములు మనలను బంధించి కేవలము ఒక విధమైన అశాంతిలోనికి తోస్తుండాయి. దీనికి ఎవరు కర్త? ఎవరు కారణం? మన కోరికలే కారణము, మనకు మనమే కర్త. కాని, యీ సత్యాన్ని గుర్తించుకోలేక నా దుఃఖమునకు యెవరో కారణమని, నా అశాంతికి ఎవరో కారణమని మనము అపోహలు పడుతున్నాము. ఇది రెండవ తప్పు. మనము మన స్వరూపాన్ని వదలి కేవలము జగత్తులో ప్రవేశించటము మొదటి తప్పు. మన తప్పును కప్పిపుచ్చుకొని దానిని మంచిగా తిప్పుకొనేకోసమై చేసే తప్పు, రెండవ తప్పు. మన తప్పును గుర్తించి తిరిగి తప్పు చేయకుండా ఒప్పులో ప్రవేశించటం ఉత్తముని లక్షణము. ఇక్కడ ఒక

sri sathyasai vachanamrutam

విధమైన సన్నిహిత సంబంధ బాంధవ్యమును గుర్తించాలి. జీవితము దేనికోసము వచ్చింది? జీవితము కామించే నిమిత్తము రాలేదు, ప్రేమించే నిమిత్తము వచ్చిందనే సత్యమును గుర్తించాలి. ఈ ప్రేమయే భగవంతునియొక్క ప్రధానమైన శక్తి. ఈ దృఢమైన, స్థిరమైన, పవిత్రమైన, స్వార్థరహితమైన ప్రేమ సర్వులయందు ఉంటున్నది.

**మితిమీరిన స్వార్థమువలన మానవత్వము గతి తప్పుతున్నది**

అయితే మానవుడు 'స్వ, పర' అనే భేదములకు గురికావటముచేత యిది భిన్నముగా రూపొందుతున్నది. 'నా', 'పర' అనే వాటియందుకూడను కొంత విచారణ చేయాలి. నేను సుఖముగా ఉంటుండాలి అని ఒక ఆశ అందరికి ఉంటున్నదే! ఇక్కడ చక్కగా విచారణ చేయాలి, ఈ 'నేను' గురించి. 'నా సుఖాన్ని నేను యెంత ఆశిస్తున్నానో ఎదుటివ్యక్తికూడను అదేవిధంగా తన సుఖాన్ని ఆశిస్తూ ఉంటాడు, ఇందులో తప్పులేదు,' అనే సత్యాన్ని గుర్తించాలి. నీ సుఖము నీకు యెంత ప్రధానమో, ఎంత ప్రమాణమో, ఎదుటవానియొక్క సుఖముకూడను అంత ప్రమాణము, అంత ప్రధానము. కానీ యీ సమత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించటంలేదు. ఈనాటి మానవులు నాపైన నాకు యెంతప్రీతియో, ఎదుటి వ్యక్తికికూడా తనపైన తనకు అంత ప్రీతి. తనను యితరులు యేవిధముగా గౌరవించాలని ఆశిస్తాడో, ఎదుటివ్యక్తి కూడను తన్ను యితరులు గౌరవించాలని ఆశించటములో తప్పులేదు కదా! ఇట్టి విశాలమైన భావము యీనాటి విద్యార్థులయందుగాని, విద్యావంతులయందుగాని రావటంలేదు. విద్య అనగా యేమి? 'సావిద్యా యా విముక్తయే!' 'సా' అనగా పవిత్రము. 'సా' అనగా బ్రహ్మతత్త్వము, సర్వవ్యాపకత్వము, సర్వజ్ఞత్వము. యిలాంటి సర్వజ్ఞత్వము, సర్వశక్తిత్వము, సర్వవ్యాపకత్వము అయిన ఈ సకారతత్త్వము సర్వులయందు ఉంటున్నది. ఈ విశాల భావములు అభివృద్ధి గావించుకోటం విద్యావంతుల ప్రధానకర్తవ్యము. 'నన్ను యితరులు గౌరవించాలి. కాని నేను మాత్రం యితరులను గౌరవించనక్కరలేదా?' కనుక, నీవు మొట్టమొదట యితరులను గౌరవించిన తదుపరి నీవు యితరుల గౌరవానికి అర్హుడవౌతావు. ఈ విధమైన సమత్వమును మనము విస్మరిస్తున్నాము. మితిమీరిన స్వార్థమును అభివృద్ధి పరచుకుంటున్నాము. తద్వారా

srisathyasaivachanamrutam

మానవత్వపు గతులు తప్పుతున్నాము. గతులు తప్పటంవలన మతులు భ్రమిస్తున్నాయి. మతి భ్రమించటంచేత రాగ ద్వేషములలో మనము ప్రవేశిస్తున్నాము. ఈ రాగద్వేషములే అమితమైన మాలిన్యముగా రూపొందుతున్నది. ఈ మాలిన్యమే మనయొక్క స్వరూపాన్ని కప్పిపుచ్చుతున్నాది.

**దేహభ్రాంతి అభివృద్ధి అయ్యేకొలది ఆనందము దూరమవుతూ ఉంటుంది**

విద్యార్థులారా! మీరు గుర్తించవలసినది ఒక్క ముఖ్యమైన విషయం. ప్రతి వస్తువు కూడను 'నాది, నాది' అనుకుంటున్నాము. కానీ, నిజానికి ఏదీ నీది కాదు. 'ఈ బట్టనాది, యీ ఛైర్ నాది', అనుకుంటున్నావు. కానీ యీ ఛైర్, యీ బట్ట యెంతవరకు నీది? 'ఈ ఛైర్ నాది' అనుకుంటే ఛైర్, నీవు వేరుగా ఉన్నారు కదా! 'ఇది నాబట్ట' అంటే, బట్టకంటే నీవు వేరుగా ఉన్నావు కదా! నాదేహమంటే, దేహము కంటె నీవు వేరుగా ఉన్నావు కదా! కనుక నీవు ఎవరు? ఈ సత్యాన్ని గుర్తించుకుంటే 'యివన్నీ నావి, నావి' అని ఎవరూ అనుకోరు. మానవత్వము అన్నింటియందు సమత్వముగానే ఉంటుంది. అది అందరియందు ఉంటున్నది. కనుక, ప్రతివ్యక్తి కూడను 'నేను, నేను' అనే పదమును ఉపయోగపెడుతున్నాడు. రాముడు ఎవరంటే 'నేను' అని లేస్తున్నాడు, ఒక వ్యక్తి. కృష్ణుడెవరంటే 'నేను' అని లేస్తున్నాడు మరొక వ్యక్తి. గోవిందుడెవరంటే 'నేనే' అని లేస్తున్నాడు వేరొక వ్యక్తి. గోపాలుడెవరంటే 'నేనే' అని లేస్తున్నాడు, ఇంకొక వ్యక్తి. రాముడు, కృష్ణుడు, గోవిందుడు, గోపాలుడు, ఈవిధంగా రూప, నామములు వేరైనప్పటికిని నా ప్రశ్నకు అందరు 'నేను', 'నేను', అని ఒకే విధంగా సమాధానము చెబుతున్నారు. అందరియందు ఉన్నది అదే I, I. ఈ I లో రెండు రకములైన I లు ఉంటున్నాయి. ఒకటి eye. అయితే యిది దేహమునకు సంబంధించినది. ఏకాక్షర I మరొకటి ఉంటున్నది. అదే ఆత్మకు సంబంధించినది. ఒకటి దేహాత్మ, ఒకటి పరమాత్మ. ఈ దేహాత్మకు కులము, మతము, వయస్సు అన్ని రకముల గుణములు ఉంటున్నాయి. 'నేను బ్రాహ్మణుడను', అంటారు. అయితే దేహమును పురస్కరించుకొని నేను బ్రాహ్మణుడనంటున్నావు. నేను యువకుడను అంటున్నావు. ఆ యువకుడనేది నీదేహమును పురస్కరించుకొని అంటున్నావు. నేను వృద్ధుడను. దేహాన్ని పురస్కరించుకొని అంటున్నావు. నేను పురుషుడను, దేహాన్ని పురస్కరించుకొని అంటున్నావు. ఇవన్నీ దేహానికి సంబంధించినవే! కాని, 'నేను, నేను' అనేదే ఆత్మయొక్క

sri sathyasai vachanamrutam

సంబంధము. 'నేను రాముడు, నేను కృష్ణుడు, నేను బ్రాహ్మణుడను, నేను శూద్రుడను' యివన్నీ దేహసంబంధమైన భ్రాంతులు. బ్రాహ్మణుడుగాని, మరొకడుగాని, మరొక దేశము వాడు గాని అందరు ఆకలైతే భుజిస్తున్నారు, దప్పికైతే నీరు త్రాగుతున్నారు. గాలిని పీల్చుకుంటున్నారు. అందరికి గాలి, నీరు, నిప్పు సమానమే కదా! నీటిదే కులము చెప్పగలరా? నిప్పుదేకులమో చెప్పగలరా? గాలిదేకులమో మీరు చెప్పగలరా? కనుక, యీ కులము లేని నిప్పు, నీరు, గాలి అందరూ అనుభవిస్తూనే ఉన్నారు. ఇక్కడ అందరూ సమానమే కదా! మన దేహమును పురస్కరించుకొని యీ దేహముతో అనుభవిస్తున్నాము. కనుకనే దేహభ్రాంతి యీ లోకమునకు మాత్రమే సంబంధము గలది. ఈ దేహభ్రాంతి అభివృద్ధి అయ్యేకొలది ఆత్మభ్రాంతి క్షీణిస్తూ వస్తున్నది. కనుక ఆనందమునకు మనము అతిదూరమై పోతున్నాము.

**మానవుడు ఆశించవలసినది, శాశ్వతానందము**

ఈనాడు మనము అనుభవించే ఆనందము క్షణికమైనది. నిజమైన ఆనందము పెరగనిది, తరగనిది. ఇప్పుడు మనకు ఆకలౌతున్నది. హోస్టలుకు వెళ్లి రెండు చపాతీలు భోంచేశావు. తృప్తి అయింది. ఆనంద పడుతున్నావు. ఈ ఆనందము ఎంతసేపు? రెండు గంటలే! మరల ఆకలి ప్రారంభమవుతుంది. అప్పుడు మరల యేదో ఒకటి భుజించాలి. ఇవంతా జీర్ణమైపోయేవి. ఈ జీర్ణించేవాటివలన కలిగే ఆనందము తాత్కాలికమే. మనము ఆశించవలసినది, శాశ్వతానందము. శాశ్వతమైన ఆనందము ఆత్మలక్ష్యమునందే మనకు లభ్యమవుతుంది. అటువంటి ఆనందము అందుకోటానికి ప్రయత్నించాలి. మనము పోగొట్టుకున్నది ఒక చోటు, వెతికేది వేరొకచోటు. మనము అనుభవించేది ఒకచోటు, ఆలకించేది వేరొక చోటు. ఒక చిన్నవిషయము చక్కగా గుర్తించాలి. వర్షము ఎక్కడనుండి వస్తుంది? మేఘమునుండి. మేఘములో నీరు యెక్కడినుండి చేరింది? సూర్యుని తేజస్సు వల్ల సముద్రజలము ఆవిరిగా మారింది. ఆ ఆవిరి యెక్కడనుండి వచ్చింది? సముద్రమునుండి. సముద్రములోని నీరు ఆవిరిగామారి మేఘములలో చేరి వర్షంగా కురిసి వాగులు వంకలుగా నదులలో చేరి ప్రవహించి సముద్రములో కలసిపోతుంది. కనుకనే, 'ఎచ్చట పుట్టెనచ్చట కేగుట నైజము ప్రాణికోటికిన్', అన్నారు. ఎక్కడ పుట్టిందో అక్కడికే పోయి చేరిపోతుంది, జలము. ఒక పాత్ర ఉంది. మట్టిపాత్ర.

sri sathyasai vachanamrutam

ఈ పాత్ర ఎక్కడనుండి పుట్టింది? మట్టినుండి పుట్టింది. ఈ మట్టినుండి పుట్టిన పాత్ర చేయిజారి క్రింద పడింది. ముక్కలు ముక్కలై పోయింది. దానినెవరూ ఆశించరు. అక్కడనే వదలిపోతాము. వారు వీరు తొక్కినడచి అనేక రకములుగా చేసి అది తిరిగి మట్టిమాదిరి అయిపోతుంది. మట్టినుండి వచ్చిన కుండ మట్టిలోనే చేరిపోతుంది. మానవుడెక్కడనుండి వచ్చాడు. భగవద్గీతలో 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః', అని చెప్పబడింది. నాయనా! నీవు నానుండే వచ్చావు. నానుంచి వచ్చానన్నప్పుడు, తన నుండి వచ్చినటువంటివారు తనలోనే పోయిచేరాలి గాని, ఎక్కడనుండో వచ్చి ఎక్కడికో వెళ్లిపోతే ఏమి ప్రయోజనము?

కార్యార్థియై ఒక మానవుడు వూరును వదలి పట్టణాన్ని చేరాడు. అయితే ఆ పట్టణములో తనపని పూర్తి చేసుకున్న తరువాత ఒక్కక్షణమైనా యింక అక్కడ ఉండడు. ఎక్కడనుండి వెళ్లాడో అక్కడికి తన స్వగ్రామానికి వచ్చి చేరిపోతాడు. పట్టణములో యెంత ఆకర్షణీయమైనవి ఉండినా, ఎంత విలువైన పదార్థములు కనుపించినా, ఎంత చక్కని భోజనము ఉన్నా హోటలులో మంచి డన్‌లప్ బెడ్సు, సోఫాలు, ఎయిర్ కండీషన్‌లు ఉండినా అక్కడ తనకిష్టం ఉండదు. తన పని అయిన తరువాత యింక విశ్రాంతి యే మాత్రము అక్కడ తీసుకోడు. తన ఊరికి ప్రయాణమవుతాడు. అదే విధముగనే మనము కర్మక్షేత్రయాత్రికులము. ఈ మిథ్యాజగత్తుకు వచ్చాము. మన సత్యాన్ని మనము గుర్తించుకొని మన స్వస్థానానికి ప్రయాణమై పోవాలి. యిదికేవలం ఒక సత్యమును నిరూపించే మార్గమే! అన్నింటియందుకూడను సత్యము అంతర్భూతమై ఉంటుంది. సైంటిస్టులు చెబుతూ ఉంటారు, 'Atom అనేది చాలా ప్రధానమైనది' అని. అది కంటికి కనుపించదు, దానినుండే సర్వమూ వచ్చింది అంటారు. కాదు, కాదు Truth is more fundamental than atom. ఈ atom కు కూడను truth అనేది foundation గా ఉంటుంది. కనుకనే 'సత్యాన్నాస్తి పరోధర్మః'. ఈ సత్యాన్ని మనము గుర్తించాలి. ప్రతి మానవుడు సత్యం తెలుసుకొనికూడా లోక సంబంధమైన జీవితముకోసమని అసత్యాన్ని ప్రవేశపెట్టుకుంటున్నాడు.

**'సత్యాన్నాస్తి పరోధర్మః'**

ఒక ఉదాహరణము. ఒక పెద్ద మహారాజు సత్యవాక్పరిపాలకుడు. అతని పేరు

sri sathyasai vachanamrutam

సత్యకాముడు. ఇది ఉపనిషత్తులలో ఉండిన మహాతత్త్వము. అతను ఒక వెన్నెల రాత్రి విహారార్థమై భోజనము అయిన తరువాత వెడుతున్నాడు. సింహద్వారము దగ్గరకు వచ్చేటప్పటికి ఒక సౌందర్యవంతమైన స్త్రీ సర్వాలంకార భూషితురాలై గలగల నవ్వుతూ తన ముందు నిల్చింది. మహారాజు నమస్కరించాడు. 'తల్లీ! మీరెవరు? ఈ భవనమునుండి బయటకు ఎందుకు వెడుతున్నారు', అని ప్రశ్నించాడు. చాలా వినయ, విధేయతలతో, ఆ స్త్రీని గౌరవించాడు. 'రాజా! నాకు నీ అనుమతి కావాలి', అంది ఆమె. అప్పుడు మహారాజు తిరిగి 'మీరెవరు? నా అనుమతి మీకెందుకు?' అని ప్రశ్నించాడు. 'నేను నీ రాజ్యలక్ష్మిని. ఈనాడు నీరాజ్యాన్ని వదలి నేను వెడుతున్నాను' అని ఆమె చెప్పింది. ఆయన సంతోషించాడు. 'నీకు ఉండటానికి యిష్టం లేనప్పుడు పోతున్నావు, పోయిరా!' అన్నాడు. ఆమె వెళ్లింది. మరికొంతదూరం పోతున్నాడు. అతి సౌందర్యవంతుడైన ఒక పురుషుడు ఎదురువచ్చి 'రాజా! నాకు అనుమతి యివ్వమని అడిగాడు. 'మీరెవరు?' అన్నాడు, రాజు. 'నేను దానము అనే స్వరూపుడను, ధనము లేనప్పుడు దానము యేవిధముగా చేయగలవు? కనుక, ధనముతోపాటు నేనుకూడా వెడుతున్నాను. పర్మిషన్ యివ్వ'మని అడిగాడు. 'సంతోషము, నీకొక Goodbye వెళ్లిరమ్మ'న్నాడు. మరి కొంతదూరము పోయేటప్పటికి యింకొక మహాపురుషుడు వచ్చి నిలుచున్నాడు. అతనినికూడా రాజు ప్రశ్నించాడు, 'నీవెవరు?' అని. 'నేను సదాచారసంపన్నుడను', అన్నాడు. 'రాజా! ధనము, దానము వెళ్లిన తరువాత సదాచారమిక్కడ యేంపని చేయగలదు? కనుక, నేనుకూడను వారితో వెడుతున్నాను', అన్నాడు. 'సరే! నీవుకూడా వెళ్లిరా', అని పర్మిషన్ యిచ్చాడు. మరికొంత దూరము పోయాక యింకొక వ్యక్తి వచ్చాడు. 'రాజా! నేను యశస్సుని. ధనము, దానము సదాచారము వెళ్లిన తరువాత నాకేమిపని ఉంటుంది. కనుక నేనుకూడను వెడుతున్నాను పర్మిషన్ యిమ్మ'న్నాడు. ఇచ్చాడు పర్మిషన్. మరికొంతదూరం పోయాక మరొక వ్యక్తి వచ్చాడు. 'రాజా! నాకు అనుమతి యివ్వాలి', అన్నాడు. 'నీవెవరు?' అన్నాడు. 'నేను సత్యాన్ని', అన్నాడు. 'ధనము పోయింది, దానము పోయింది, సదాచారము పోయింది, యశస్సు పోయింది, నేనుండి ప్రయోజనము ఏమిటి?' అని అడిగాడు. అప్పుడు రాజు సత్యస్వరూపునికి సాష్టాంగ నమస్కారం చేసి గట్టిగా కాళ్ళు పట్టాడు. ఎవరు వెళ్ళినా నాకు అక్కరలేదు. నాకేమి సంబంధము లేదు. ధనముతో నాకవసరం లేదు. దానము నాకక్కరలేదు. సదాచారము నాకక్కరలేదు.

srisathyasai vachanamrutam

యశస్సు, కీర్తి నాకక్కరలేదు. సత్యమే నాకు కావాలి. మీరు వెళ్లటానికి వీలులేదు', అని గట్టిగా అతని కాళ్ళు పట్టాడు. ఈ రాజుయొక్క ప్రార్థనను అంగీకరించి సత్యము తిరిగి రాజభవనములో ప్రవేశించింది. అప్పుడు కొన్ని లక్షణములలోపల ధనము, దానము, యశస్సు, సదాచారము తిరిగి వెనుకకు వచ్చాయి. "మహారాజా! సత్యము లేని ధనము నిరుపయోగము. సత్యము లేని యశస్సు కేవలము కాపీ కొట్టి డిగ్రీ పొందినట్టుగా ఉంటుంది. సత్యము లేని కీర్తి, యిదేమి కీర్తి, అపకీర్తి. మా అందరియందు సత్యము ప్రాణస్వరూపము. కనుక సత్యాన్ని వదలి మేము ఎక్కడికి వెళ్లము. తిరిగి మమ్మల్ని ప్రవేశించటానికి అనుమతి యివ్వుము" అన్నాయి. అప్పుడే సత్యకాముడు 'సత్యాన్నాస్తి పరోధర్మః' అన్నాడు. సత్యము లేని ధర్మముగాని, సత్యము లేని ధనము గాని, సత్యములేని సదాచారముగాని, సత్యములేని కీర్తిగాని నిలువదు, యీ జగత్తునందు. కనుకనే సత్యము, సత్యము, సత్యము. దీనివల్లనే వేదము నందుకూడను 'సత్యంవద, ధర్మంచర' అని బోధించబడింది. మొట్టమొదట సత్యము, తరువాత ధర్మము. సత్యమనేటువంటిది పునాది. దాని పైననే ధర్మమనే భవనము నిర్మాణమైంది.

**మానవునకు తృప్తియే నిజమైన ఆనందము నిస్తుంది**

విద్యార్థులారా! సత్యమార్గాన్ని ప్రవేశించండి. సత్యముతో మీయొక్క వాక్కును పవిత్రము గావించండి. సత్యజీవితాన్ని గడపండి. సత్యమైన ఆనందాన్ని అభిలషించండి. అదే నిత్యానందము. అదే పరమానందము. అదే యోగానందము. అదే అద్వైతానందము. అద్వైతానందమనగా 'సర్వులయందు ఉండిన ఆనందమే నాయందు ఉంది, నాయందు ఉన్న ఆనందమే సర్వులయందు ఉంది' అని. కనుకనే ఈ సత్యాన్ని మనము చక్కగా పట్టుకుంటే సర్వమూ మనకు లభ్యమైపోతుంది. ఈ సత్యములోనే ఆనందముంటున్నది. కనుక, మనము సత్యమార్గము నవలంబించి, భ్రాంతులను కొంతవరకు అదుపులో పెట్టుకొని, కోరికల నరికట్టుకొని అనుగ్రహానికి పాత్రులు కావాలి. ఆగ్రహానికి పాత్రులు కారాదు. కనుకనే వేదాంతమునందు

**తగదు తగదు ధనదాహము నరుడా**
**మంచి బుద్ధితో మానుము కోర్కెలు**

srisathyasaivachanamrutam

మంచి బుద్ధితో మనము కోర్కెలను వదలాలి. ఏవో ఒక force తో గాని, ఏదో ఒక నిర్బంధముతో గాని వదలకూడదు.

**మంచి బుద్ధితో మానుము కోర్కెలు**
**కర్మ ఫలితమే కదరా విత్తము**

ఈ విత్తనము యెక్కడనుండి వచ్చింది? నీవు చేసిన కర్మకు ఫలముగా నీకు వచ్చింది. నీవు ఆర్జించినదే యీ విత్తము. ఏ చెట్టునుండో పుట్టలేదు. ఆకాశమునుండి పుట్టలేదు. భూమినుండి ఉద్భవించలేదు. ఈ విత్తనము నీ కర్మ ఫలితమే! 'కలిగినంతలో కనరా తృప్తిని' ఎంత ఉందో దానితో మనము తృప్తి పడాలి. ఈ తృప్తి అనేదే మానవునకు నిజమైన ఆనందాన్ని అందిస్తుంది. కాబట్టి తృప్తి, తృప్తి. వాడే గొప్పవాడు, యీ జగత్తునందు. He who has many desires is the poorest man. He who has much satisfaction is the richest man. వాడే నిజమైన ధనికుడు. వాడే నిజమైన ఘనుడు. వాడే నిజమైన ఆత్మతత్త్వుడు. తృప్తి పడాలి, తృప్తి పడాలి.

**కృషి కూటికొరకు, విద్య విజ్ఞానముకొరకు**

ఇలాంటి తృప్తి నిమిత్తమై కొన్ని రకములైన విచారణలు సలుపుతూ వెళ్లాలి. మీరు చదివే చదువుకు, మీరు చేసే పనులకు, మీరు కోరే ఉద్యోగములకు యెట్టి సంబంధము లేదు. మీరు ఉద్యోగము, చదువు యివన్నీ కూడను యేదో కూటికోసం అనుకుంటున్నారు. కాదు, కాదు. చాలా పొరపాటు. కృషి కూటికోసం, విద్య విజ్ఞానము కోసము. ధనము రెండు చేతులలో లక్షలు లక్షలు కట్టలుగా ఉండవచ్చు. కాని, ఆకలిని తీర్చలేదే యీ డబ్బు. మీ ఆకలి తీరాలంటే పంటనే కావాలి, వంటనే కావాలి. ఈ పంటకు కృషియే జరగాలికాని చదువుతో పనిలేదు. కృషి సంగతి సేద్యగానికే తెలుస్తుంది గాని, ఉద్యోగస్తునికి తెలియదు. సచ్చిదానందము చెప్పాడు, "ఇదంతా కేవలము ఒక విధమైన అణువులయొక్క సమూహము. దీనినుండే చేతనా జగత్తు అంతా పుడుతోంది" అని. ఈ పరమాణువులయొక్క సమ్మిళితమైన స్వరూపము నుండి అయితే, యీ పరమాణువులకు ఆకర్షణశక్తి ఎవరిచ్చారు? అది nature అని ఒక మాటలో కొట్టేస్తున్నారు. ఈ nature ఎక్కడనుండి వచ్చింది? ఒకసారి ఒక విద్యార్థి తన తాతగారిని ప్రశ్నించాడుట. తాతగారు చాదస్తుడు. ఆ కుర్రవాడు ఏదో homework చేసుకుంటూ కూచుంటే, తాతగారు

srisathyasaivachanamrutam

సాయంకాలము సంధ్యవార్చుకుంటూ 'కేశవాయనమః, నారాయణాయనమః, మాధవాయనమః , గోవిందాయనమః, మధుసూధనాయనమః' అని ఒక్కొక్క తూరి ఒక్కొక్క స్పూను నీరు తీసుకొని మింగుతున్నాడు. చూచాడు యీ కుర్రవాడు. తన homework వదలిపెట్టి తాతగారివైపుకే చూస్తున్నాడు. తాతగారికి దాహమైతే ఒక్కతూరి టంబ్లరుతో తాగవచ్చుకదా! ఒక్కొక్క స్పూను వేసుకొని ఎందుకు త్రాగుతున్నాడు? ఏమిటీ చాదస్తము? అనుకున్నాడు. ఇదంతా పూర్తయిన తరువాత ప్రశ్నించుదామని అనుకున్నాడు, పాపం. ఈ లోపల తన homework తాను చేసుకుంటామని ప్రారంభించాడు. అది పాతకాలం. కనుక, యింకు బుడ్డిని ప్రక్కనపెట్టుకొని ఆ pen ఒక్కతూరి అద్దటము, మళ్ళీ ఒక్కతూరి వ్రాయటము, అద్దటము, వ్రాసుకోటము చేస్తున్నాడు. చూచాడు యీ తాతగారు కూడా. ఇతనికి తెలుసు, యింకు బుడ్డిలో పెన్ను అద్దుకుని వ్రాయాలని. ఈ అమాయక పిల్లవాడు ప్రశ్నించాడు తాతగారిని, సంధ్యవార్చడం పూర్తయిన తరువాత, "మీకు దాహమైతే ఆటంబ్లరు నీరంతా ఒక్కతూరి త్రాగరాదా, ఒక్కొక్కస్పూను వేసుకొని యెందుకు మీరు త్రాగటం?" అన్నాడు. అప్పుడు తాతగారు ప్రశ్నించాడు, "నాయనా! ఆ యింకు బుడ్డిలో ఒక్కొక్క తూరి అద్దుకొని వ్రాయటం ఎందుకు? బుడ్డిలోని ఇంకు నీ పేపరుపైన పోస్తే చాలదా?" అన్నాడు. అప్పుడా విద్యార్థి చెప్పాడు, "ఏమిటి, తాతా? అక్షరాలు కనపడవు, పేపరంతా యింకు అయిపోతుంది", అన్నాడు. తాతగారు చెప్పాడు, "ఇదికూడా అంతే నాయనా? దీనికికూడా నామాక్షరాలు ఉంటున్నాయి. ఒక్కొక్కపేరు చెప్పినప్పుడు ఆ పేరుకు చెందుతుంది. 'కేశవ' అని చెప్పినప్పుడు 'కేశవ' అనే పదము కనుపిస్తుంది. ఒక తూరి 'మాధవా' అనే పదము కనిపిస్తుంది. దీనికి అంతే! ఇదీ ఒక భగవత్ తత్త్వమే. ఒక్కొక్క దానికి ఒక్కొక్క అంతరార్థము ఉంటుంది. దీని అర్థాన్ని గుర్తించుకోకుండా నీవు సమయమును వ్యర్థము చేయవద్దు', అన్నారు తాతగారు.

ఈనాటి తెలివితేటలు కేవలం గొప్పవిగా ఉన్నట్లు భావిస్తున్నామేగాని యిందులో యేమాత్రం కూడా General knowledge అనగా సహజమైన గుణములు కనుపించటం లేదు. హంస పాలలో మూతిపెట్టేటప్పటికి నీరు వేరు, పాలువేరు అవుతుందని అంటున్నారు, ప్రాచీనులు. ఇది యేరీతిగా జరుగుతుందని ప్రశ్నించారు కొందరు. ఈనాటి వైజ్ఞానికుడు చెప్పాడు, "యిదేమంత గొప్పకాదు. దాని మూతి దగ్గర ఒక విధమైన acid ఉంటుంది. అది



sri sathyasai vahini amrutam

ఆ పాలలో మూతి పెట్టేటప్పటికి నీరు వేరు, పాలు వేరు అవుతాయి" అన్నాడు. 'ఇది యేమీ దైవసృష్టికాదు', అన్నాడు. నిజమే ఏసిడ్డే. దానికి ముక్కుదగ్గర acid ఎవరు పెట్టారు? నువ్వు పెట్టావా? ఇదే దైవసృష్టి.

**(తేదీ. 07-07-1988 భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam